
# ఒక గూటి పక్షులు



"సారీ సార్... అన్ని గదులూ ఫుల్ అయిపోయాయి. మీరు ఓ గంట ముందు వచ్చివుంటే ఎలాగో సర్దేవాళ్ళం!"

– హోటల్ రిసెప్షనిస్ట్ రోహిత్‌తో అన్నాడు.

"ఎలాగైనా అడ్జెస్ట్ చేయండి ప్లీజ్! ఇప్పటికే తిరుపతిలో ఉన్న అన్ని హోటల్స్ తిరిగి తిరిగి అలసిపోయి ఉన్నాను..." అన్నాడు రోహిత్.

రిసెప్షనిస్ట్ నిస్సహాయంగా అతని వైపు చూశాడు. తర్వాత ఏదో గుర్తొచ్చినవాడిలా తలాడించి, "ఈ లైను చివరి గదిలో ఓ అమ్మాయిగారు ఉన్నారు. ఆ గదిలో ఓ బెడ్ ఖాళీగా ఉంది. కాని, అమ్మాయిగారు ఒప్పుకుంటారో, లేదో?!" అన్నాడు.

"అడిగి చూడండి... ఈ రాత్రి పడుకుని ఉదయం వెళ్లిపోతానని చెప్పండి!" అభ్యర్థనగా అన్నాడు. రిసెప్షనిస్ట్ డ్రా లాక్ చేసుకుని వెళ్లాడు.

రోహిత్ అక్కడేవున్న ఓ కుర్చీలో కూర్చున్నాడు. అతను స్నేహితుని పెళ్ళికి తిరుమల వచ్చాడు. పెళ్ళి చూసుకుని, దేవుడి దర్శనం చేసుకొని కొండ దిగేసరికి రాత్రి పది గంటలైంది. గంట సేపట్నుంచి ఎన్ని హోటల్స్‌లో విచారించినా అతనికి గది దొరకలేదు.

అతనికి చాలా అలసటగా ఉంది. ముందురోజు హైదరాబాద్ నుంచి తిరుపతి వరకు జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణించాడు. అందువల్ల రాత్రి సరిగ్గా నిద్రపోలేదు. మధ్యాహ్నం నుంచి దేవుడి దర్శనం కోసం క్యూలో చాలాసేపు నిల్చోవడం వల్ల బాగా అలసిపోయాడు. నిద్ర ముంచుకొస్తోంది అతనికి. రిసెప్షనిస్ట్ యింకా రాలేదు.

గదిలో చోటివ్వడానికి ఆ అమ్మాయి ఒప్పుకుంటుందన్న నమ్మకం రోహిత్‌కి లేదు. 'అయినా రాత్రిపూట ఓ అపరిచితుడికి తన గదిలో చోటివ్వడానికి ఏ అమ్మాయి ఒప్పుకుంటుంది? కాకపోతే, మనిషి ఆశాజీవి కాబట్టి తన ప్రయత్నాలు తాను చేస్తూంటాడు...' అనుకున్నాడు.

అతనికి రిసెప్షనిస్ట్ వస్తూండటం కనిపించింది. లేచి నిలబడి ఆశగా అతని వైపు చూశాడు. "అమ్మాయిగారు ఒప్పుకున్నారు. మీరు అడ్వాన్స్ చెల్లించి వెళ్లండి" అన్నాడతను.

రోహిత్‌కి ఎంతో ఆనందం కలిగింది ఆ మాట వినగానే. అడ్వాన్స్ చెల్లించి బ్యాగ్ తీసుకున్నాడు. "జాగ్రత్త! పిచ్చివేషాలు వేస్తే నేను యింటికి, మీరు జైలుకి వెళ్లాల్సి ఉంటుంది!" అన్నాడు రిసెప్షనిస్ట్.

"ఆడవాళ్ళను ఉంచే జైలుకయితే నేను రెడీ!" నవ్వుతూ అన్నాడు రోహిత్.

అతను రోహిత్ వైపు అనుమానంగా చూసి "రూమ్ నెంబర్ తొమ్మిది... ఈ లైను చివరి గది!" అన్నాడు.

"థాంక్యూ!" అంటూ గది వైపు నడిచాడు రోహిత్.

గది తలుపులు తెరిచే వున్నాయి. లోపల నైట్‌ల్యాంప్ వెలుగుతోంది. కానీ, ఏవి ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవడానికి ఆ వెలుతురు చాలడం లేదు. తలుపు గడియ వేయడానికి కాస్త జంకాడు మొదట. మళ్లీ 'క్యాష్, లగేజి జాగ్రత్తగా ఉండాలి కదా!' అనుకొని తలుపు గడియ వేశాడు. మంచం ఎక్కడ ఉందో వెతుక్కుని, ఆ మంచంపై 'అమ్మాయిగారు' లేరని నిర్ధారించుకుని మంచంపై వాలిపోయాడు. కొద్దిక్షణాలలోనే నిద్రలోకి జారిపోయాడు.

●

ఉదయం ఆరు గంటలకు రోహిత్‌కి మెలకువ వచ్చింది.

అప్పటికే 'అమ్మాయిగారు' రెడీ అయి కూర్చునివుంది. చిలకపచ్చ రంగు చీర, అదే రంగు రవిక ధరించివుంది. రోహిత్ ఆమె వైపు చూసి, పలకరింపుగా నవ్వాడు.

ఆమె కూడా నవ్వింది. అతను బ్రష్, పేస్ట్, టవల్ తీసుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. బయటకు వచ్చాక ఆమెకు ఎదురుగా మంచంపై కూర్చుని, "మీకు ఎన్ని థాంక్స్‌లు చెప్పాలో నాకు తెలియటం లేదు. నిన్న రాత్రి మీరు గదిలో చోటివ్వకుండా ఉండివుంటే ఎంతో యిబ్బంది పడివుండేవాణ్ణి!" అన్నాడు.

"ఫర్వాలేదు. అదేం పెద్ద సహాయం కాదులెండి!" అంది.

ఆమె చాలా అందంగా ఉంది. తెల్లని మేనిరంగు, పెద్దవైన కళ్ళు, కోటేరు ముక్కు పెద్ద జడ, అందమైన పలువరుసతో చూసేకొద్దీ చూడాలనిపించేలా ఉంది.

"బై ది బై... నా పేరు రోహిత్!" అన్నాడు. 'అలాగా...' అన్నట్టు చూసింది.

"శిరీషా కుసుమంలా సుకుమారంగా ఉన్నారు కాబట్టి మీ పేరు తప్పకుండా 'శిరీష' అయివుంటుంది!"

ఆమె ఆశ్చర్యంగా అతనివైపు చూస్తూ "భలే కనుక్కున్నారేఁ..!" అంది.

అతను నవ్వుతూ, "అంతగా ఆశ్చర్యపోకండి! హోటల్ రిజిస్టర్‌లో మీ పేరు చూశాను" అన్నాడు. ఫక్కున నవ్వింది శిరీష.

"కాఫీ త్రాగారా?" రోహిత్ అడిగాడు. ఆమె తల అడ్డంగా ఊపింది.

అతను బెల్ కొట్టి, అటెండర్ వచ్చాక రెండు కాఫీలు తెమ్మని చెప్పాడు.

అయిదు నిమిషాల్లో కాఫీలు వచ్చాయి. కాఫీ సిప్ చేసి, "అద్భుతం!" అన్నాడు.

ఆమె తలెత్తి చూసి, ఏమిటన్నట్టు చూసింది.

"కాఫీ... 'ఆనంద్' సినిమాలా ఉంది!"

ఆమె నవ్వింది.

కాఫీ త్రాగాక కప్పు క్రిందపెడుతూ, "నాకింకోటి త్రాగాలనివుంది!" అన్నాడు.

"ఏమిటది?" అనుమానంగా చూస్తూ అంది.

"కాఫీ! ఇంకో కాఫీ త్రాగాలని ఉంది... అన్నాను. ఓ గంటాగి మళ్లీ త్రాగుదాం!" అన్నాడు. తర్వాత, "మీరు చాలా బాగున్నారు..." అన్నాడు.

ఆమె 'అలాగా...' అన్నట్టు నవ్వింది. ఆ నవ్వులో సిగ్గు కనిపించింది అతనికి.

అతను ఆమెనే చూస్తున్నాడు... అందానికి అమాయకత్వం తోడైతే చూడటానికి ఎంత ఆహ్లాదంగా ఉంటుందో అతనికి మొదటిసారిగా అనుభవమైంది.

ఆమె యిబ్బందిగా చూసింది అతని వైపు.

తర్వాత "మీ ప్రోగ్రామ్ ఏమిటి?" అని అడిగింది.

"తిరుచానూరు వెళ్లాలి!"

"నేనూ తిరుచానూరుకే వెళ్తున్నాను. నాతో వస్తారా?"

"వస్తాను. ఈ అమ్మాయిగారితో ఆ అమ్మవారిని చూడటం నాకిష్టమే!" అన్నాడు.

ముప్పై నిమిషాల తర్వాత యిద్దరూ హోటల్ బయటికొచ్చారు.

"ఇందాక 'ఇంకోటి' త్రాగాలని ఉందని చెప్పాను. త్రాగి వెళదామా?" అని ఆమెని అడిగాడు రోహిత్.

"ఇంకో 'టీ' వద్దు. కాఫీ త్రాగుదాం!" అంది శిరీష.

కాఫీ త్రాగాక బస్‌స్టేషన్ వైపు చూడసాగారు. "ఆటోలో వెళ్దామా?" రోహిత్ అడిగాడు.

"వద్దు. బస్సులు చాలా ఉన్నాయి. ఛార్జి కూడా చాలా తక్కువ."

"బస్సులో పోతే మనకు ఏకాంతం దొరకదు కదా?!"

"ఆటోలో కూడా దొరకదు. ఆటోడ్రైవరుంటాడు."

"అతనికి మనం కనిపించకుండా అతని కళ్ళు మూస్తాను."

"అప్పుడు మనం స్వర్గంలో కలుసుకుంటాము."

"అబ్బః... మీరూ, నేనూ కలిసున్న చోటు తప్పకుండా స్వర్గమే అయివుంటుందని ఎంత ఇన్‌డైరెక్ట్‌గా చెప్పారండీ!"

"ఇంక చాలు. బస్సు బయలుదేరుతోంది... ఎక్కండి!" విసుగు నటిస్తూ అంది.

గుడిలో ప్రవేశించగానే రోహిత్ మాటలు ఆపేశాడు.

అతని ముఖంలో సీరియస్‌నెస్, కళ్ళలో భక్తిభావం చూస్తుంటే 'తనతో యింతసేపు తమాషాగా మాట్లాడిన వ్యక్తి యితనేనా?" అనిపించింది ఆమెకు.

గుడి బయటకొచ్చాక "అబ్బః... గుడిలోకొచ్చాక ఎంత ట్రాన్స్‌ఫార్మేషన్ మీలో! 'ఈ పిల్లి పాలు త్రాగునా?' అన్నట్టు కనిపించారు" అంది శిరీష.

"అవును. పాలు త్రాగదు. కాఫీ త్రాగుతుంది!" అన్నాడు రోహిత్ నవ్వుతూ.

అక్కడే ఓ హోటల్‌లో టిఫిన్ తిని తిరుపతి తిరిగొచ్చారు యిద్దరూ.

"మధ్యాహ్నం వరకూ ఈ ఎండలో ఏం చేయాలి?" అంది శిరీష.

"ఏ.సి. థియేటర్‌లో మంచి సినిమా చూడాలి!" అంటూ ఓ థియేటర్ ముందాగి, "అరెః... ఇందులో 'మన్మథుడు' సినిమా ఆడుతోంది. వెళదామా?" అని అడిగాడు రోహిత్.

"ఈ మన్మథుడితో ఆ మన్మథుణ్ణి చూడటం నాకిష్టమే!" అంది శిరీష.

"భలే కొట్టారు దెబ్బ! నన్ను 'మన్మథుడు' అన్నారు కాబట్టి తీయని దెబ్బ యిది!" థియేటర్‌లోకి నడుస్తూ అన్నాడు.

ఇంటర్వెల్‌లో కాఫీ త్రాగుతూ "ఎలా ఉంది సినిమా?" అని అడిగింది శిరీష.

"మీలా ఉంది."

"అంటే..?" అర్థంకానట్టు చూసింది.

"చూడటానికి ఆహ్లాదంగా ఉంది. మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తోంది!"

అతని కాంప్లిమెంట్ ఆమెకెంతో ఆనందాన్నిచ్చింది. "నాగార్జున ఈ వయసులో కూడా ఎంతో అందంగా, యంగ్‌గా కనిపిస్తున్నాడు కదూ!" అంది.

"జయాపజయాల్ని ఒకేలా తీసుకుంటూ, చిత్తశుద్ధితో తన పని తాను చేసుకుపోతూ, అసూయాద్వేషాలకు అతీతంగా, అందరితో నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ ఉండే మనిషి వయసుతో సంబంధం లేకుండా నిత్యయవ్వనుడిలా కనిపిస్తాడు."

ఆమె ఆశ్చర్యంగా చూసింది అతని వైపు.

"ఏమిటలా చూస్తున్నారు? నేనిలా మాట్లాడుతూంటే గుమ్మడి స్టెప్స్ వేస్తూ డాన్స్ చేస్తే ఎలా ఉంటుందో అలా ఉంది కదూ?" అన్నాడు.

"అవును. మొదటిసారి మీనుంచి సీరియస్ డైలాగ్స్ వింటున్నాను."

సినిమా వదిలారు. ఇద్దరూ భీమాస్ హోటల్‌లోకి నడిచారు. రోహిత్ భోజనం ఆర్డరిచ్చాడు యిద్దరికీ. "మీరేం చేస్తుంటారు?" శిరీష అడిగింది అతన్ని.

"ఇలా మాటల్తోనే బ్రతికేస్తుంటాను."

"మీరు టీవీ యాంకరా?"

"ఏం..? నా తెలుగు అంత భయంకరంగా ఉందా?" అన్నాడు.

ఆమె పకపకా నవ్వింది. భోజనాలయ్యాక గది చేరుకున్నారు.

టైము చూసింది శిరీష. మూడు కావస్తోంది.

"మీకు ట్రైను ఎన్ని గంటలకు?"

"అయిదున్నరకు!"

ఆమె దిగాలుగా చూసింది అతని వైపు. తర్వాత "ఏదైనా మాట్లాడండి!" అంది.

"ఏం మాట్లాడను?" అతని ముఖంలో కూడా దిగులు కనిపించింది ఆమెకు.

"మీ గురించి చెప్పండి!" అంది.

"నా గురించి చెప్పడానికి ఏం లేదు. నాన్న పెట్టే చిత్రహింసలు భరించలేక అమ్మ నన్ను తీసుకుని అతనికి దూరంగా వచ్చేసినప్పుడు నా వయసు మూడేళ్లు. అప్పట్నుంచీ గత ఏడాది వరకూ ఎన్నో బాధలూ, అవమానాలు పడ్డాను. ఎన్నో రకాల పనులు, ఉద్యోగాలు చేశాను. తెలిసీ తెలియని వయసులో దొంగతనాలు కూడా చేశాను. దెబ్బలు తిన్నాను. ఈ పాతికేళ్లలో ప్రపంచంలోని కుళ్ళును, మోసాన్ని చూశాను. దుష్టుల్ని, దుర్మార్గుల్ని చూశాను. అలాగే మనుషుల్ని, కొందరు దేవతల్ని కూడా చూశాను. ఈ ప్రపంచం నాకెన్నో పాఠాల్ని నేర్పింది.

మా అమ్మ నాకు దేవత. ఆమె పడ్డ బాధలు చాలా తక్కువమంది తల్లులు పడివుంటారు. నాకు యుక్తవయస్సు వచ్చాక అమ్మ నన్ను ఓ కోరిక కోరుతుండేది. నేను చక్కటి అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలని, ఆమె కంటతడి పెట్టకుండా చూసుకోవాలని ఆమె కోరిక. నేను జీవితంలో నిలదొక్కుకునే సమయానికి అమ్మ చనిపోయింది. ఆమె పోయాక ఒంటరితనం నన్ను భయపెట్టింది, బాధపెట్టింది. అది మరచిపోవడానికి చేసిన ప్రయత్నం వల్ల అందరితో మాట్లాడటం, అతిచనువు ప్రదర్శించడం అలవాటయిపోయింది. మీతో కూడా కాస్త అతిగా మాట్లాడటానికి కారణం అదే! నా మాటలు మిమ్మల్ని నొప్పించివుంటే నన్ను క్షమించండి!" అన్నాడు రోహిత్.

"అదేం లేదు. 'ఈ కాలం అబ్బాయిలు ఇలాగే మాట్లాడుతుంటారు' అనుకున్నాను. మీరు అలా మాట్లాడటానికి కారణం యిప్పుడు తెలిసింది. మీరు తేలికగా ఆ బలహీనతను అధిగమించగలరు."

"సరే... ఇక మీ విషయం చెప్పండి! మీరు ఇలా హోటల్లో ఒంటరిగా ఓ రోజంతా గడిపారని తెలిస్తే మీ అమ్మానాన్నలు కోప్పడతా?" అని అడిగాడు.

"అమ్మైనా, నాన్నైనా ఎవరైనా ఉండుంటే యిట్టాగ యీరోజు హోటల్లో గడిపేదాన్నా?" అని పాడి, నవ్వబోయింది. అయితే తల్లిదండ్రులు గుర్తొచ్చినందువల్ల కళ్ళలో నీళ్లు తిరిగి నవ్వలేకపోయింది.

"అంటే... మీకు అమ్మానాన్నా లేరా?"

"లేరు."

"నాలాగే ఒంటరివాళ్ళు అన్నమాట! మరి, యీ హోటల్‌లో మీరు ఎందుకున్నారో నాకర్థంకావడం లేదు."

"అది చెప్పాలంటే మీకు నా కథ చెప్పాలి. మా అమ్మానాన్నలది ప్రేమవివాహం. పెద్దలను ఎదిరించి, వాళ్ళతో సంబంధం తెంపుకుని, విజయవాడ నుండి తిరుపతికి వచ్చి సెటిలయ్యారు. నాన్నకున్న తెలివితేటలకు ఆయన చేసిన ఉద్యోగం చాలా చిన్నది. ఉన్నంతలో అమ్మ తెలివిగా కాపురాన్ని నెట్టుకొచ్చేది. వాళ్ళకు ఏకైక సంతానాన్ని నేను. గత ఏడాది బి.ఎస్.సి. పూర్తిచేశాను.

ఆరు నెలల క్రితం అమ్మానాన్నా వాకింగ్ వెళ్లి వస్తూంటే ఓ కారు వాళ్ళను గుద్దింది. నాన్న అక్కడికక్కడే చనిపోతే అమ్మ హాస్పిటల్ పాలైంది. అమ్మను బ్రతికించుకోవడానికి స్నేహితుల దగ్గర, తెలిసినవాళ్ళ దగ్గర అప్పులు చేశాను. వారంరోజులు మృత్యువుతో పోరాడి ఓడిపోయింది మా అమ్మ. 'హిట్ అండ్ రన్' కేసు కాబట్టి ఇన్సూరెన్స్ డబ్బులు రాలేదు. లక్ష రూపాయల అప్పు మిగిలింది నాకు. నాన్న పి.ఎఫ్., యితర సేవింగ్స్ అన్నీ కలిపి, ఆఫీసులో ఆయన తీసుకున్న అప్పులు పోగా- యాభైవేలు మాత్రమే చేతికి వచ్చాయి. యాభైవేల అప్పు అలాగే ఉండిపోయింది. నేను ఓ చిట్‌ఫండ్ కంపెనీలో ఉద్యోగంలో చేరాను. అయితే నేను బ్రతకడానికి పోను అప్పు తీర్చడానికి నాకు మిగిలేది చాలా తక్కువ. అప్పు యిచ్చినవాళ్ళ ఒత్తిడి ఎక్కువవసాగింది.

ఏం చేయాలో నాకు తోచలేదు. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ అమ్మినా పదివేలకు మించి రాదు. అటువంటి సమయంలో మా కొలీగ్ ఒక ప్రపోజల్ నా ముందు పెట్టాడు. ఆరునెలల పాటు తన స్నేహితుడైన ఓ సంపన్నుడితో కలిసివుంటే పాతికవేలు ఆ స్నేహితుడు నాకిస్తాడట. నేను 'సరే...'నన్నాను. ఈ హోటల్‌లో గది తీసుకుని ఉంటే అతను వచ్చి నన్ను కలుస్తానన్నాడు.

నిన్న ఉదయం రూమ్ బుక్ చేసుకుని అతని కోసం ఎదురుచూడసాగాను. సాయంత్రం ఫోన్ వచ్చింది... అతనికి 'చికెన్ గున్యా' వచ్చిందని, వారంరోజుల దాకా రాలేదని!

నా దగ్గర హోటలు బిల్లు కట్టడానికి సరిపడే డబ్బులు కూడా లేవు. రిసెప్షనిస్ట్‌తో- 'షాపింగ్ కెళ్లినప్పుడు నా పర్సు పోయిందని, ఎవరికైనా గది అవసరమైతే నా గది పంచుకో వచ్చని, మగవాళ్ళైనా డీసెంట్‌గా ఉంటే యిచ్చెయ్య'మని అన్నాను. నా అభ్యర్థన మన్నించి అతను మీకు గది యిచ్చాడు."

"మరి, తిరుచానూరు ఎందుకు వచ్చారు?"

"మీతో పరిచయం పెంచుకుంటే హోటల్ బిల్లు మీతో కట్టించవచ్చనుకున్నాను."

ఆమెలోని నిజాయితీ అమాయకంగా ఆమెచే నిజాల్ని చెప్పించింది.

రోహిత్ ఆమెవైపు జాలిగా చూసి, "మీ అప్పుల్ని తీర్చడానికి మీరు ఎన్నుకున్న మార్గం మంచిది కాదు. వివేకానందుడు చెప్పాడు- 'ఇఫ్ మనీ యీజ్ లాస్ట్... నథింగ్ ఈజ్ లాస్ట్! ఇఫ్ హెల్త్ ఈజ్ లాస్ట్... సమ్‌థింగ్ ఈజ్ లాస్ట్! ఇఫ్ క్యారెక్టర్ ఈజ్ లాస్ట్... ఎవ్విరిథింగ్ ఈజ్ లాస్ట్!' అని! మీరు మొదటిదాని కోసం మిగిలిన రెండూ కోల్పోవడానికి సిద్ధపడ్డారు. ఈ హోటల్ డీసెంట్‌గా లేదని చూడగానే తెలిసింది నాకు. ఇలాంటి హోటల్స్ పైన పోలీస్ రైడింగ్‌లుంటాయి. అదే జరిగుంటే మీ పరిస్థితి ఏమిటి? మిమ్మల్ని ఇక్కడికి రమ్మన్నవాడు నిజంగా పాతికవేలిచ్చే నిజాయితీపరుడా? అతడు ఏ ఎయిడ్స్ పేషెంటో అయితే మీ ఆరోగ్యం

ఏమయ్యేది? ఓ సమస్య నుంచి బయటపడటానికి చేసిన ప్రయత్నంలో మరికొన్ని సమస్యల్లో కూరుకుపోయి ఉండేవారు. మీ అదృష్టం బాగుంది అలాంటివేం జరగలేదు" అన్నాడు.

"నేను చేస్తున్నది తప్పో, ఒప్పో ఆలోచించలేదు. నా అప్పులు వీలైనంత త్వరలో తీర్చేయాలి. అదే నా ప్రియారిటీ అప్పుడు! ఇప్పుడు ఆలోచిస్తే నేనెంత తెలివితక్కువ నిర్ణయం తీసుకున్నానో తెలుస్తోంది. అయితే భగవంతుడిపై భారం వేసే నేనిక్కడికి వచ్చాను. ఆయన నాకు మంచి చేస్తాడనే నమ్మకం నాకుండేది. ఆ నమ్మకం వమ్ము కాలేదు..." అంది శిరీష.

రోహిత్ వాచీ వంక చూసి లేచి నిలబడ్డాడు. తన పర్సులోంచి విజిటింగ్ కార్డ్ ఆమెకిచ్చి, "ఇక నేను బయలుదేరుతాను. హోటల్ బిల్లు సంగతి నేను చూసుకుంటాను. మీరు మీ యింటికి వెళ్లిపోండి!" అన్నాడు. ఆమె విజిటింగ్ కార్డ్ చూసి-

"మీరు సినిమా రచయితా?" అని అడిగింది ఆశ్చర్యంగా చూస్తూ.

"అవును. చెప్పాగా... మాటల్తోనే బ్రతికేస్తుంటానని! నాలుగు సినిమాలకు మాటలు రాశాను. మరో నాలుగింటికి రాస్తున్నాను."

"యు ఆర్ గ్రేట్! ఓ సినీ రచయిత నాకు స్నేహితుడయినందుకు ఎంతో గర్వపడుతున్నాను" అంది. రోహిత్ నవ్వి బ్యాగ్ చేతిలోకి తీసుకున్నాడు.

ఆమెకు ఏడుపు వస్తోంది. చేతుల్తో ముఖం కప్పుకుని ఏడవసాగింది.

"శిరీషగారూ... ఏమైంది మీకు? ఎందుకేడుస్తున్నారు?" ఆదుర్దాగా అడిగాడు.

"నా తల్లిదండ్రుల ప్రేమ తప్ప మరొకరి ప్రేమ, ఆదరణ యింతవరకూ చవిచూడలేదు నేను. అటువంటిది- మొదటిసారిగా ఓ వ్యక్తి నామీద అభిమానం చూపడం, చనువుగా మాట్లాడటం, నా క్షేమం కోసం తాపత్రయపడటం నన్ను కదిలించింది. ఆ వ్యక్తి దూరమవుతున్నందుకు బాధగానూ వుంది" అంది కన్నీరు తుడుచుకుంటూ.

"ఆ యాభైవేలు నేనిస్తాను. నాతో హైదరాబాదు వచ్చేస్తారా?"

"ఎన్ని రోజులు?"

ఆమె అమాయకంగా అడిగినా అతని మనసుని బాధపెట్టిందా మాట.

"జీవితాంతం... నా భార్యగా!" అన్నాడు.

ఆమె నమ్మలేనట్లు చూసింది. తర్వాత "నా గురించి మీకు పూర్తిగా తెలియదు. తెలిసిన ఆ కొంతా నా గురించి మంచి చెప్పలేదు" అంది.

"చెప్పాగా... ఈ ప్రపంచం నాకెంతో నేర్పిందని! ముఖం చూసి ఎవరెటువంటివారో నేనూ చెప్పగలను. చెప్పండి... నాతో వస్తారా?"

ఆమె లేచి అతని చేయి అందుకుంది.

"నీకూ నీవారు లేరు... నాకూ నావారు లేరు... కలిసి గూడు కట్టుకుందామా..."

అతని నోటినుంచి అప్రయత్నంగా ఆ పాత సినిమా పాట వచ్చింది.

'ఆంధ్రభూమి' వారపత్రిక ... 27 జూలై' 2006